# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 11-9-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 35 పేజీలు:6 వెల: రూ.1/-


## యూపీలో దారుణం- దివ్యాంగురాలైన దళిత బాలికపై వేడి అన్నం విసిరిన ప్రిన్సిపాల్

లక్నో, సెప్టెంబర్ 10: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో దారుణం జరిగింది. దివ్యాంగురాలైన దళిత బాలికపై వేడి అన్నాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ విసిరాడు. దీంతో ఆమె శరీరంపై కాలిన గాయాలయ్యాయి. బారాబంకి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆగస్ట్ 29న ఇచ్చౌలి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. అయితే ఒడ్డిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్, రెండో తరగతి చదవుతున్న దళిత బాలికపైకి వేడి అన్నం విసిరాడు. దీంతో ఆ బాలిక చేయి, మోచేతికి కాలిన గాయాలయ్యాయి.

కాగా, సెప్టెంబర్ 3న జరిగిన తాసిల్ దివస్‌లో ఆ బాలిక తల్లి దీనిపై అధికారులకు చెప్పింది. స్కూల్ ప్రిన్సిపల్ తన కుమార్తెపైకి వేడి అన్నం విసరడంతో ఆమె చేతికి కాలిన గాయాలయ్యాయంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీంతో ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించారు. దీనిపై దర్యాప్తు చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.మరోవైపు ఆ బాలిక దివ్యాంగురాలని జిల్లా ఎస్పీ తెలిపారు. విద్యాశాఖ అధికారి నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## గిరిజన, ఆదివాసీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సత్యవతి

హైదరాబాద్, సెప్టెంబర్ 10: జాతీయ సమైక్యత వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 17న ఆదివాసీ, బంజారా ఆత్మగౌరవ భవనాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రారంభ కార్యక్రమాల నిర్వహణపై మంత్రి సత్యవతి రాథోడ్ సమీక్ష నిర్వహించారు. గిరిజన, ఆదివాసీ, ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, సభ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 17న పీపుల్స్ ప్లాజా నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. గిరిజన, ఆదివాసీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజన, ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

## పెయింటింగ్స్‌తో ఆర్ట్ ఎగ్జిబిషన్ సాంస్కృతిక మార్పిడి దేశాల మధ్య మంచి సంబంధాలు బలపరుస్తుంది : శ్రీమతి. మీనాక్షీ లేఖి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: ఎల్ సాల్వడార్‌కు చెందిన ప్రఖ్యాత కళాకారుడు రోడాల్ఫో వేగా ఒవిడో పెయింటింగ్స్‌తో న్యూఢిల్లీ ఐజీ ఎన్ సీ ఏ గ్యాలరీలో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటయింది. వ్యవహారాలు మరియు సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి శ్రీమతి మీనాక్షీ లేఖి ప్రముఖ కళాకారుడు రోడాల్ఫో వేగా ఒవిడో సమక్షంలో ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ సహకారంతో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ (ఎఆఅఖీ) మరియు రిపబ్లిక్ ఆఫ్ ఎల్ సాల్వడార్ రాయబార కార్యాలయం ప్రదర్శన ఏర్పాటు చేశాయి.

శ్రీమతి మీనాక్షీ లేఖి ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాల మధ్య సత్సంబంధాలు పెంపొందించడానికి సాంస్కృతిక మార్పిడి తోడ్పడుతుందని అన్నారు. కళలను ఆస్వాదించి ప్రశంసించడం ద్వారా ఒకరి జీవన విధానాన్ని మరొకరు అర్థం చేసుకుని జీవన విధానంతో సుపరిచితం కావడానికి సాంస్కృతిక మార్పిడి సహాయపడుతుందని శ్రీమతి మీనాక్షీ లేఖి పేర్కొన్నారు. కళా ప్రదర్శన ఏర్పాటు చేసిన రోడాల్ఫో వేగా ఓవిడోను మంత్రి అభినందించారు. భారతదేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్న సమయంలో రోడాల్ఫో వేగా ఓవిడో ఇక్కడకు వచ్చారని మంత్రి అన్నారు.

ఒక పెయింటర్, ఇంటీరియర్ ఆర్కిటెక్ట్ మరియు సాంస్కృతిక నిర్వాహకునిగా రోడాల్ఫో వేగా గుర్తింపు పొందారు. ఫ్రాన్స్ మరియు లాటిన్ అమెరికా మధ్య సంబంధాలు బలోపేతం చేసేందుకు రోడాల్ఫో వేగా చేసిన కృషిని గుర్తించిన ఫ్రెంచ్ ప్రభుత్వం ఆయనకు అవార్డు ఇచ్చి గౌరవించింది.

రోడాల్ఫో పెయింటింగ్‌లు విలక్షణమైన కథల ఆధారంగా రూపు దిద్దుకుంటాయి. జాగ్రత్తగా సేకరించిన తీగ, ఇసుక మరియు ఆకు వంటి పదార్థాలు అతని జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ఉత్తమ చిత్రాలుగా రూపుదిద్దుకుంటాయి. యాక్రిలిక్ మరియు నియాన్ పెయింటెడ్ కాన్వాస్‌లు సార్వత్రిక లేదా పౌరాణిక అంశాలను సులువుగా అర్థం అయ్యే విధంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాయి. రేఖా గణిత నమూనాలు, రంగులు మరియు అల్లికల సమ్మేళనంతో రోడాల్ఫో వేగా చిత్రాలు మాట్లాడే విధంగా ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తాయి. చిత్రాలను నిశితంగా పరిశీలిస్తే వాటిలో వాస్తుశిల్పం, దేవాలయం, కిరణాలు, సూర్యుడు, చంద్రుడు లాంటి గూఢార్థం కూడిన పొరలు కనిపిస్తాయి. సూర్యుడు లేదా చంద్రుని కదలికతో గృహాన్ని ప్రధానంగా ఆకాశాన్ని వర్ణిస్తూ చిత్రాలు కనిపిస్తాయి.

స్వయంగా గీసిన చిత్రాలు, ప్రత్యేకంగా సేకరించిన చిత్రాలతో రోడాల్ఫో వేగా ఒవిడో ప్రపంచవ్యాప్తంగా 20 కంటే ఎక్కువ దేశాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆర్ట్ ఎగ్జిబిషన్ లో మెట్జ్‌లోని పాంపిడౌ మ్యూజియం, టెహ్రాన్ ఆర్టిస్టిక్ హౌస్, స్పానిష్ రక్షణ మంత్రిత్వ శాఖ, హవానాలోని గోమెజ్ ప్యాలెస్, క్యూబా మొదలైనవి ఉన్నాయి.

## త్వరలో అమరావతి మున్సిపాలిటీ.. ఈ నెల 12 నుంచి గ్రామసభలు

అమరావతి, సెప్టెంబర్ 10: త్వరలో 22 గ్రామాలను కలుపుకుని మున్సిపాలిటీగా అమరావతి ఏర్పాటు కానున్నది. ఈ మేరకు గ్రామ సభల నిర్వహణ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 12 నుంచి గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు అమరావతి మున్సిపాలిటీని ఏర్పాటు చేయనున్నారు. గతంలో తుళ్లూరు మండలం పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు అమరావతి మున్సిపాలిటీ ఏర్పాటును వ్యతిరేకించారు.అమరావతి మున్సిపాలిటీ ఏర్పాటుకు అడుగు పడింది. 22 గ్రామాలతో అమరావతి మున్సిపాలిటీ ఏర్పాటుకానున్నది. ఈ నెల 12 నుంచి గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకు మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించనున్నది. గతంలో తుళ్లూరు మండలంలోని పలు గ్రామాలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించగా.. ప్రస్తుతం నాన్‌పూలింగ్ గ్రామాలు తమను మున్సిపాలిటీలో చేర్చాలని చేసిన విజ్ఞప్తిని పరిశీలనలోకి తీసుకుని ఈ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తున్నది. తుళ్లూరు మండలంలోని 16 గ్రామాలతోపాటు నాన్ పూలింగ్ గ్రామాలు పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురంతోపాటు మంగళగిరిలోని మూడు పంచాయతీలు కలిపి మొత్తం 22 గ్రామాలతో అమరావతి మున్సిపాలిటీ ఏర్పాటు కానున్నట్లు సమాచారం.

### చరిత్రలో నేటినిజం



కం॥ ఈలలు, పువ్వుల మాలలు

(సెప్టెంబర్ 11 క్రికెటర్ లాలా అమరనాథ్‌జయంతి..)

–రాధశ్రీ

సెల్:9494481210



## మత్స్యరంగం అభివృద్ధికి నిరంతర కృషి : తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, సెప్టెంబర్ 10: మత్స్య రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంబజార్‌లో రూ. 9.50కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన ఫిష్ మార్కెట్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం భవనం మొత్తం కలియదిరిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో సరైన సౌకర్యాలు, వసతులు లేక విక్రయదారులు, కొనుగోలు దారులు అనేక ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు.

దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రూ. 9.50 కోట్ల వ్యయంతో అన్ని సౌకర్యాలు, వసతులతో నూతన మార్కెట్ భవనాన్ని నిర్మించిందన్నారు. 43 హోల్‌సేల్ స్టాల్స్, కోల్డ్ స్టోరేజీ, 90 రిటైల్ స్టాల్స్, 71 కటింగ్ స్టాల్స్, పది డ్రై ఫిష్ స్టాల్స్, ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవనంలో లిఫ్ట్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే వారికి మాత్రమే స్టాల్స్‌ను కేటాయిస్తామని స్పష్టం చేశారు. స్టాల్స్‌కు అర్హులైన వారి పేర్ల జాబితాను బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణంలో చేపలను విక్రయించుకోవడం వలన మత్స్యకారులు గిట్టుబాటు ధరను పొందే అవకాశం ఉంటుందనే ఆలోచనతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మార్కెట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టిందన్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి, మల్లాపూర్‌లో చేపల మార్కెట్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. రూ. 50కోట్ల వ్యయంతో హోల్‌సేల్ ఎక్స్‌పోర్ట్ ఫిష్ మార్కెట్‌ను నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యం అన్నారు. పేదప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఫిషరీస్ కమిషనర్ లచ్చిరాం భూక్యా, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీఈ దేవానంద్, డీడీ దత్తు పాంత్, ఈఈ సురేష్, ఎస్టేట్ ఆఫీసర్ భాషా, టీఆర్ఎస్ నేతలు ప్రేమ్‌సింగ్, నందు బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## మలి దశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ : ఎర్రబెల్లి దయాకర్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 10: మలి దశ తెలంగాణ ఉద్యమానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తి అని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి (చిట్యాల) ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, నన్నపునేని నరేందర్‌తో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ నిజాం రజాకార్లను, దేశ్‌ముఖ్‌లను ఎదుర్కొన్న వీరవనిత అని కొనియాడారు.

ఆమె జయంతి, వర్ధంతిని ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ చూపుతూ ఆనాటి దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల గుండెల్లో భయం పుట్టించిందన్నారు. ఒక వైపు సాయుధ పోరాటం చేస్తూనే, మరోవైపు అమ్మలా ఉద్యమకారులకు అన్నం పెట్టి ఆదరించిన మహనీయురాలన్నారు. ఐలమ్మ భూపోరాటం విజయంతో అప్పటి ఉద్యమ నాయకులు అప్పటి దొరల భూములు పేదలకు పంచారన్నారు. ఐలమ్మ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ తెలంగాణ సాధించారన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తున్నారన్నారు. పరిపాలనలో ఉద్యమ స్ఫూర్తిని పాటిస్తున్నారని, అందుకే తెలంగాణ అన్నిరంగాల్లో అగ్రగామిగా మారిందన్నారు.

## కేంద్రం అసంబద్ధ విధానాలతో దేశంలో ఆహార ధాన్యాల కొరత : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 10: తెలంగాణ రాష్ట్రాన్ని ఫెయిల్యూర్ స్టేట్‌గా చూపించాలనుకున్న ప్రధాని మోదీ సర్కారు.. తాను తీసుకున్న గోతిలో తానే పడిన చందంగా ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నాలుగేండ్లకు సరిపడా గోధుమలు, బియ్యం నిల్వలు ఉన్నాయని ఆరునెలల కింద గొప్పగా చెప్పుకున్న కేంద్ర ప్రభుత్వం, తాజాగా బియ్యం ఎగుమతులను నియంత్రించి 20 శాతం ఎగుమతి సుంకాన్ని విధించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఇప్పటికే గోధుములు, దాని ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించిన మోదీ సర్కార్, తాజాగా నూకల ఎగుమతిపైనా నిషేధం విధించిందన్నారు.

ప్రస్తుతం ఎఫ్‌సీఐ గోడౌన్లతో పాటు వివిధ కేంద్రాల దగ్గర బియ్యం, నూకలు, గోధుమల నిల్వలు భారీగా తగ్గడంతోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని కొనాలని కేవలం ఆరు నెలల కిందట తాము విజ్ఞప్తి చేస్తే, దేశంలో అవసరానికంటే ఎక్కువ ఆహార నిల్వలు ఉన్నాయని చెప్పి తిరస్కరించిన కేంద్ర ప్రభుత్వం, ప్రస్తుత కొరతకు కారణమేంటో చెప్పాలని కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు. దేశ ప్రజల అవసరాలపై కనీస అవగాహన లేకపోవడం, ఆహార ధాన్యాల సేకరణలో కేంద్ర ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విధానమంటూ లేకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణమని కేటీఆర్ ధ్వజమెత్తారు.

ప్రజల ఆహార అవసరాలపై మోదీ సర్కారుకు ప్రణాళిక కరువు

తెలంగాణ రైతులు, రాష్ట్రంపై మోదీ సర్కార్‌కు ఉన్న వివక్షతోనే దేశంలో ఆహార ధాన్యాల కొరత తలెత్తే ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. దేశ ప్రజల ఆహార అవసరాలపై కేంద్ర సర్కారుకు దీర్ఘకాలిక ప్రణాళిక కరువైందన్న సంగతి ప్రస్తుత సంక్షోభంతో తేలిపోయిందన్నారు. దేశాభివృద్ధి, ప్రజాసంక్షేమంపై కనీస అవగాహన, ఆలోచన, ప్రణాళిక లేని మంద బుద్ధి బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఉండడం ప్రజల దురదృష్టమని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు నూకలు తినిపించడం అలవాటు చేయాలని అవమానించిన పియూష్ గోయల్, ఇప్పుడు నూకల ఎగుమతులను నిషేధించి వాటినే తింటారెమో అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

రాష్ట్రంగా ఏర్పడి 8 సంవత్సరాలే అయినప్పటికీ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఏ రాష్ట్రం కూడా అందుకోని విధంగా ప్రగతి పథంలో దూసుకుపోతున్న తెలంగాణకి న్యాయంగా దక్కాల్సిన చేయూత మోదీ సర్కార్ నుంచి అందడం లేదని కేటీఆర్ ఆరోపించారు. నీళ్ల విషయంలో అరిగోస పడ్డ తెలంగాణ రైతాంగ దశ మార్చడానికి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంతో శ్రమకోర్చి సాగునీటి ప్రాజెక్టులను రికార్డు సమయంలో పూర్తి చేశారన్నారు. ఉచిత కరెంటు, రైతుబంధు వంటి విప్లవాత్మక పథకాలతో తెలంగాణలో లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని చెప్పారు.

దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ..

పుట్ల కొద్దీ ధాన్యం పండించి దేశానికే అన్నం పెట్టే స్థాయికి అన్నపూర్ణగా తెలంగాణ ఎదిగిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే యాసంగిలో బాయిల్డ్ రైస్ తీసుకోమంటు మోదీ సర్కార్ కొర్రీలు పెట్టడంతో తెలంగాణ రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుందన్నారు. రైతులను వరి వెయ్యనియ్యకుండా ఇతర పంటల వైపు మళ్లించాలని రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి తెచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. ఫలితంగా గత వానకాలం సీజన్‌తో పోల్చితే ఈసారి సీజన్‌లో దేశవ్యాప్తంగా సుమారు 95 లక్షల ఎకరాల్లో వరిసాగు తగ్గిందన్నారు.

రాబోయే రోజుల్లో ఇది కోటి ఎకరాలు దాటే అవకాశం కూడా ఉందని కేటీఆర్ చెప్పారు. దీంతో దేశవ్యాప్తంగా 12–15 మిలియన్ టన్నుల బియ్యం ఉత్పత్తి తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. ఇందుకే బియ్యం ఎగుమతులను కేంద్రం నియంత్రించిందన్నారు. దేశానికి ఒక సమగ్ర ఆహార ధాన్యాల సేకరణ విధానం లేకపోవడం మోదీ ప్రభుత్వ వైఫల్యమే అని కేటీఆర్ ధ్వజమెత్తారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఆహార భద్రత లేని పరిస్థితిలో ఉండడం బీజేపీ ప్రభుత్వ హ్రస్వ దృష్టిని సూచిస్తోందన్నారు.

ఇప్పటికైనా కేంద్రం రాజకీయాలు పక్కనపెట్టాలి

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన విధానాలు మార్చుకొని ప్రజల సంక్షేమం, ఆహార భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దేశ వ్యవసాయ రంగం, ఆహార అవసరాలపై కేంద్రం ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాలన్నారు. ఇందుకోసం వన్ నేషన్ వన్ ప్రొక్యూర్మెంట్ పాలసీని అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఎప్పటి నుంచో కోరుతోందన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ధాన్యం సేకరణ విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని అమలుచేయకుండా దేశ రైతాంగాన్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని విమర్శించారు.

పండిన ధాన్యాన్ని సేకరించకుండా కేవలం రాజకీయాలకే ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ రోజు ఆహార కొరత ముంగిట్లో దేశం నిలిచిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి ఎలాంటి వివక్షకు తావు లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని కేటీఆర్ ంచారు. భారీగా ధాన్యం పండిస్తున్న తెలంగాణ లాంటి రాష్ట్రాల నుంచి పూర్తిస్థాయి ధాన్యాన్ని సేకరించి దేశ ప్రజల ఆహార భద్రతను ధోకా లేకుండా చూడాలని పీయూష్ గోయల్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఈ నెల 27న శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం జగన్

తిరుమల, సెప్టెంబర్ 10: శ్రీవారి బ్రహ్మోత్సవాల తొలి రోజైన సెప్టెంబర్ 27న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. మరుసటి రోజు పరకామణి భవనాన్ని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభిస్తారని చెప్పారు. శ్రీవారి ఆలయ బంగారు తాపడం విధివిధానాలపై వచ్చే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈఓ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈ నెల 27న రాత్రి 7 గంటలకు సీఎం జగన్ శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అనంతరం రాత్రి 9 గంటలకు ప్రారంభమయ్యే పెద్దశేష వాహనసేవలో పాల్గొంటారని ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. మరుసటి రోజు ఉదయం పరకామణి నూతన భవనాన్ని సీఎం జగన్ ప్రారంభిస్తారని చెప్పారు. ఆధునిక వసతులతో ఏర్పాటుచేసిన ఈ భవనంలో కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని భక్తులు చూసేందుకు వీలుగా రెండువైపులా అద్దాలు ఏర్పాటు చేశామన్నారు. శ్రీవారి ఆలయం నుంచి హుండీలను బ్యాటరీ కార్ల ద్వారా పరకామణి భవనానికి తరలిస్తారని చెప్పారు. కానుకలు భద్రపరిచేందుకు వీలుగా స్ట్రాంగ్ రూములు నిర్మించినట్లు తెలిపారు. నాణేలను వేరు చేసేందుకు రూ.2.50 కోట్లతో కాయిన్స్ ఆటోమేటిక్ సెగ్రిగేషన్ మిషన్ ఏర్పాటు చేశామన్నారు.

## భారతదేశంలో సుస్థిర తీర నిర్వహణ అనే అంశంపై జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారతదేశంలో సుస్థిర తీర నిర్వహణ అనే అంశంపై ఏర్పాటైన మొదటి జాతీయ సదస్సును కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ఈరోజు భువనేశ్వర్‌లో ప్రారంభించారు.

గ్రీన్ క్లైమేట్ సంస్థ అందించిన ఆర్థిక సహకారంతో ఈ సదస్సును ఎన్‌హాన్సింగ్ క్లైమేట్ రెసిలెన్స్ ఆఫ్ ఇండియాస్ కోస్టల్ కమ్యూనిటీస్ ఏర్పాటు చేసింది. సముద్ర తీరం, సముద్ర జీవవైవిధ్యం, వాతావరణ సమస్యలు, తీరప్రాంత కాలుష్యం అనే మూడు పరస్పర సంబంధం ఉన్న అంశాలపై దృష్టి సారించడానికి భారతదేశంలో మొత్తం 13 తీరప్రాంత రాష్ట్రాల అధికారులను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న లక్ష్యంతో సదస్సు ఏర్పాటయింది.

ముఖ్యమైన మూడు అంశాలపై దృష్టి సారించి లక్ష్యాలను సాధించేందుకు పటిష్టమైన వ్యవస్థకు సదస్సు కృషి చేస్తుంది. సంబంధిత వర్గాలు ఒకరితో ఒకరు కలిసి పని చేసేందుకు గల అవకాశాలను గుర్తించడంతో పాటు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రణాళిక రూపొందిస్తారు.

సదస్సును ప్రారంభించిన అనంతరం ఏర్పాటైన సమావేశంలో ప్రసంగించిన శ్రీ భూపేందర్ యాదవ్ భారతదేశం 7500 కిలోమీటర్ల పొడవైన తీర ప్రాంతం కలిగి ఉందని తెలిపారు. ప్రపంచంలో ఇది ఏడవ పెద్ద తీర ప్రాంతమని ఆయన వివరించారు. దేశ జనాభాలో 20 శాతం మంది ప్రజలు సముద్ర తీర ప్రాంతాల్లో నివసిస్తున్నారని అన్నారు. దేశ తీర ప్రాంతం వ్యూహాత్మక, ఆర్థిక మరియు సామాజిక ప్రాముఖ్యతను కలిగి ఉందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో తీర ప్రాంతంలో నాలుగు మెట్రోపాలిటన్ నగరాలు ఉన్నాయని గుర్తు చేశారు. దేశ తీర ప్రాంతాల్లో 17,000 కంటే ఎక్కువ జాతుల మొక్కలు మరియు జంతువులు జీవించేందుకు అనువైన వైవిధ్యమైన పర్యావరణ వ్యవస్థ ఉందని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని మంత్రి అన్నారు.

"భారతదేశం తన సవరించిన ఎన్‌డిసిలను సమర్పించిన నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని శ్రీ భూపేందర్ యాదవ్ సూచించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి బహుళ–రంగాల భాగస్వామ్యాన్ని రూపొందించడానికి కృషి జరగాలని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన పర్యావరణం, అటవీ ఓ వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ.అశ్విని కుమార్ చౌబే దేశ తీర ప్రాంతాలకు స్థితిస్థాపకత మరియు స్థిరత్వం యొక్క సంభాషణలను తీసుకురావడానికి ఇటువంటి సమావేశాలు అవసరమని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రకటించిన 'లైఫ్' ఉద్యమంలో కూడా ఇటువంటి సమావేశాలను నిర్వహించాలని సూచించారని మంత్రి తెలిపారు.

ప్రస్తుత పరిస్థితుల్లో సుస్థిర తీర నిర్వహణ అనేది ఒక ముఖ్యమైన అంశంగా గుర్తింపు పొందింది. సమర్థవంతమైన తీర నిర్వహణలో సమాచార ఆధారిత విధానాలు మరియు నిర్వహణ వ్యవస్థ, భాగస్వామ్య పరిరక్షణ నమూనాలు మరియు వాటాదారుల మధ్య సంబంధాలు కీలక అంశాలుగా ఉంటాయి.

యూఎన్డీపీ సహకారంతో తీరప్రాంత ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమం అమలు జరుగుతోంది. గ్రీన్ క్లైమేట్ ఫండ్ (ఉఅఈ) సహకారంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర ప్రాంత నిర్వహణ కోసం పటిష్ట ప్రణాళిక రూపొందించి పర్యావరణ వ్యవస్థ మరియు సమాజ–ఆధారిత విధానాలను అమలు చేయాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి.

## ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎమ్ఎమ్ఎస్ వై ) రెండవ వార్షికోత్సవం వేడుకలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: ప్ర ధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎమ్ ఎమ్ ఎస్ వై) ఈ రోజు విజయ వంతంగా రెండో వార్షికోత్సవం పూర్తి చేసుకుంది. ఈ గొప్ప రోజు ను పురస్కరించుకుని పిఎమ్ ఎమ్ ఎస్ వై ఫ్లాగ్ షిప్ కార్యక్రమం విజయాలు , భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను వివరించడానికి కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ ఈ రోజు న్యూఢిల్లీలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి శ్రీ పురుషోత్తం రూపాలా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎఫ్.ఎ.హెచ్.డి, ఐ అండ్ బి సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్, మత్స్య, పశు సంవర్ధక ,పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి శ్రీ తరుణ్ శ్రీధర్ ,ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్. అయ్యప్పన్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఎఫ్ ఎ హెచ్ డి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్ కూడా హాజరయ్యారు.

సుమారు 300 మంది మత్స్యకారులు, చేపల పెంపకందారులతో పాటు రాష్ట్రాలు /కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సీనియర్ అధికారులు ఈ వేడుకకు హాజరై తమ అనుభవాలను,విజయ గాథలను పంచుకున్నారు. పిఎమ్ ఎమ్ ఎస్ వై గురించి, దాని విజయాల గురించి మత్స్య సంపద పేరు తో వెలువరించిన బుక్ లెట్ ను , డిఓఎఫ్ న్యూస్ లెటర్ 3వ ఎడిషన్ ను , ఎగుమతి డైవర్సిఫికేషన్ కు ఉద్దేశించిన టిలాపియా యాక్షన్ ప్లాన్ ను , స్కాంపి యాక్షన్ ప్లాన్ ను, 2022–2025 నేషనల్ సీడ్ ప్లాన్ ను ఈ కార్యక్రమం లో ఆవిష్కరించారు.

ఈ ఉత్సవాన్ని నిర్వహించినందుకు, పథకం విజయాలను,భవిష్యత్తు ప్రణాళికను తెలియచేయడానికి బుక్ లెట్ లనుప్రచురించినందుకు కేంద్ర మంత్రి శ్రీ రూపాలా ఫిషరీస్ డిపార్ట్ మెంట్ ను, పిఎంసి బృందాన్ని అభినందించారు.డాక్టర్ ఎల్. మురుగన్ భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు మత్స్య రంగం అభివృద్ధికి జరిగిన కృషి, భారతదేశంలో ఒక కీలకమైన రంగంగా మత్స్య రంగం సంప్రదాయ చరిత్ర గురించి వివరించారు.

శ్రీ జతీంద్ర నాథ్ స్వైన్ సాంకేతిక పరిజ్ఞానం, పబ్లిక్ స్టాకింగ్, నదీ, సముద్ర తీర ప్రాంతాలలో జలాశయాలను పునరుద్ధరించడం ద్వారా ద్వారా మన జలాశయాలు, సహజ వనరుల నిజమైన సామర్థ్యాన్ని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. పిఎమ్ ఎమ్ ఎస్ వై కేంద్ర బిందువుగా ఉన్న మత్స్య ,చేపల రైతులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పిఎమ్ ఎమ్ ఎస్ వై పథకం కింద మత్స్య రంగంలో విజయం సాధించినందుకు వారిని అభినందించారు.

శ్రీ తరుణ్ శ్రీధర్ దేశంలో రొయ్యల విప్లవాన్ని ప్రవేశపెట్టడానికి సంబంధించి తన అనుభవాన్ని, మత్స్య రంగంలో వైవిధ్యతకు సంబంధించిన విలువైన సమాచారాన్ని పంచుకున్నారు. ఉత్పాదకత పరంగా భారతదేశాన్ని ప్రపంచ పటంలో అగ్రస్థానానికి తీసుకురావడానికి సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల ప్రాముఖ్యత , చేపల పెంపకంలో శాస్త్రీయ పద్ధతుల ఉపయోగం గురించి డాక్టర్ ఎస్. అయ్యప్పన్ నొక్కి చెప్పారు. ఎన్ ఎఫ్ డి బి చీఫ్ ఎగ్జిక్యూటివ్, డాక్టర్ సి. సువర్ణ, పిఎమ్ ఎమ్ ఎస్ వై పథకానికి గల పటిష్ఠమైన నిర్మాణాత్మక అమలు వ్యవస్థ గురించి వివరించారు.

